క్లుప్తంగా

పాక్ దేశీయులు దేశం విడిచి వెళ్లాలి

ఏలూరు (టూటౌన్): జమ్మూ-కశ్మీర్‌లో ఉగ్ర దాడి నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలు మేరకు పాక్ దేశస్తులు దేశం విడిచి వెళ్లాలని హిందూ సంఘాల ఐక్య కార్యాచరణ సమితి సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం వారు ఓ ప్రకటన విడుదల చేశారు. దేశ వ్యతిరేక కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు అనుమానం ఉన్న సంస్థలకు సంబంధించి సమాచారం ఉన్నా వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌లో గాని, సంబంధిత అధికారులుకు గానీ సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. దెందులూరు మండలం జంగారెడ్డిగూడెం రోడ్డులో గాలయిగూడెం-ముండూరు గ్రామాల మధ్య ఏడో మైలు రాయి వద్ద ఉన్న ముస్లిం మదర్సా కార్యకలాపాలపై నిఘా పెట్టి, తనిఖీలు చేసి వాస్తవాలను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఉదయం స్పందన కార్యక్రమంలో, జిల్లా కలెక్టర్‌కి, పోలీసులకు వినతి పత్రం ఇస్తామని స్పష్టం చేశారు.

సానిగూడెం విచారణ మరింత అభివృద్ధి చెందాలి



ప్రార్థనలు చేస్తున్న ఫాదర్‌బాల

దెందులూరు: సానిగూడెం ఆర్‌సీఎం విచారణ మరింత అభివృద్ధి చెందాలని ఏలూరు పీఠం వికార్ జనరల్ డాక్టర్ పి బాల అన్నారు. సానిగూడెం గ్రామంలో విచారణ కర్త ఫాదర్ జోస్ పాల్, సానిగూడెం ఆర్‌సీఎం సంఘ పెద్దలు, సంఘస్తులు, యువత ఆధ్వర్యంలో జరుగుతున్న నిత్య సహాయ మాత ఉత్సవాలు ఆదివారం ముగిశాయి. ముఖ్యఅతిథిగా విచ్చేసిన వికార్ జనరల్ బాల మాట్లాడుతూ గ్రామంలో నిత్య సహాయ మాత టవర్ నిర్మాణం జరగడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం ఫాదర్లను సానిగూడెం గ్రామ పెద్దలు, సంఘస్తులు, యువత ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు.

నూతన విద్యుత్ స్తంభాల ఏర్పాటు



దెందులూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో నూతన విద్యుత్ స్తంభాలు ఏర్పాట్లు చేస్తున్నట్లు ట్రాన్స్‌కో దెందులూరు మండలం అసిస్టెంట్ ఇంజనీర్ శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం జోగన్నపాలెంలో 20 నూతన విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారు. ఇటీవల వీచిన ఈదురు గాలులకి అనేక గ్రామాల్లో విద్యుత్ వైర్లు కిందికి వేలాడుతున్నాయన్నారు. ప్రాధాన్యత క్రమాన్ని బట్టి అన్ని గ్రామాల్లో విద్యుత్ పునరుద్ధరణ చర్యలు చేపడతామన్నారు.

ధరల మోత.. సామాన్యుడికి వాత

- నిత్యావసరాల ధరల పెరుగుదలతో అల్లాడుతున్న సామాన్యులు
- నియంత్రణ చర్యలు చేపట్టని ప్రభుత్వాలు



నిత్యావసర సరుకులు



కూరగాయలు అమ్ముతున్న మహిళా వ్యాపారి

ఏలూరు (టూటౌన్): ఆకాశానంటుతున్న నిత్యావసర సరుకుల ధరలతో సామాన్య ప్రజలు ఏం కొనేటట్టు..తినేటట్టు లేవంటూ అల్లాడుతున్నారు. ఓ వైపు పెట్రోల్,డీజిల్,గ్యాస్ ధరలు పరుగులు పెడుతున్నాయి. వాటినే అనుసరిస్తూ నిత్యావసరాలు, కూరగాయలు, పండ్ల రేట్లు ఎన్నడూ లేని విధంగా ధరలు మండిపోతున్నాయి. దీంతో సామాన్య,మధ్యతరగతి ప్రజల కొనుగోలు శక్తి తగ్గి బెంబేలెత్తిపోతున్నారు. కూరగాయలు,పండ్లు కొనుగోలు చేయడానికి జనం జంకాల్సి వస్తోంది. ధరలు పెరిగిపోతుండటంతో సామాన్యులు కొనుగోలును తగ్గించేశారు. ధరలు ఈ స్థాయిలో పెరిగిపోతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అదుపు చేయడంలో విఫలమవుతున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పెరుగుతున్న ఖర్చులు

ఏలూరు నియోజకవర్గంలో 3 లక్షల మందికి పైగా జనాభా నివసిస్తున్నారు. సుమారు లక్షకు పైగా కుటుంబాలు ఉన్నాయి. వీరిలో 90 శాతం కుటుంబాలు పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన వారే. వీరి సగటు ఆదాయం నెలకు రూ.10 వేల నుంచి రూ.15 వేల లోపే ఉండటం గమనార్హం. గతంలో నిత్యావసరాలు, కూరగాయలు, పాలకు కలిపి నెలకు రూ.10 వేల వరకూ ఖర్చు అయ్యేది.కానీ ప్రస్తుతం ఆ మొత్తం మరో 40 నుండి 50 శాతం పెరిగి పోయిందని ప్రజలు చెబుతున్నారు. పెరిగిన నిత్యావసర ధరల కారణంగా సామాన్య, మధ్యతరగతి ప్రజల ఖర్చు విపరీతంగా పెరిగి పోయింది. దీంతో సామాన్యులు తమ ఆదాయ వనరుల ప్రకారం ఖర్చులను తగ్గించుకునే ప్రయత్నాలు చేస్తున్నారు.

రాకెట్‌లా దూసుకుపోతున్న ధరలు

పెరుగుతున్న ఎండల నేపథ్యంలో నెలరోజులుగా కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ఏ కూరగాయ ముట్టుకున్నా కిలో రూ.40 వరకు పలుకుతున్నాయి. ఎన్నడూ లేని విధంగా ఉల్లిపాయలు కిలో రూ.40 నుంచి రూ.50 వరకూ పెరిగినా గత కొన్ని రోజుల నుండి ఉల్లి ధరలు తగ్గుతూ వస్తున్నాయి. ఖూరగాయాలను నియంత్రించేందుకు సంబంధిత అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కంది, మినప, పెసర, శెనగ వంటి పప్పు దినుసులు కిలో రూ.120 నుంచి రూ.170 పైకి చేరింది. మార్కెట్‌లో కంది పప్పు సాధారణంగా క్వాలిటీని బట్టి కిలో రూ.150 నుంచి రూ.170 దాకా ఉంది. మినుములు కిలో రూ.120 నుంచి రూ.165 దాకా విక్రయిస్తున్నారు. పొట్టు టీసిన మినపగుళ్లు క్వాలిటీవైతే రూ.200 వరకు అమ్ముతున్నారు. పెసర పప్పు కిలో .రూ.110నుంచి రూ.130 దాకా అమ్ముతున్నారు.శనగపప్పు సైతం కిలో రూ.90 పైనే విక్రయిస్తున్నారు. ఇక వేరు శెనగ కిలో రూ.110 నుంచి రూ.130 వరకూ అమ్ముతున్నారు.

మాంసాహార ధరలకు రెక్కలు

సామాన్య, పేద ప్రజలు ఇష్టంగా తినే మాంసాహారాల ధరలకు రెక్కలు వచ్చాయి. మార్కెట్‌లో గత నెల రోజుల నుండి కిలో చికెన్ ధర రూ.240 నుంచి రూ.260 పలుకుతుంది. అదేవిధంగా కిలో మటన్ ధర రూ.750 నుంచి రూ.1000 పలుకుతుంది. సాధారణ చెరువు చేపల ధర సైతం కిలో రూ.160 నుంచి రూ.200 పలుకుతుంది. రొయ్యలు వాటి సైజులను బట్టి కిలో రూ.220 నుంచి రూ.450 వరకూ అమ్ముతున్నారు. నల్ల జాతి చేపల రకాలైతే కిలో రూ.400 నుంచి రూ.450 వరకూ అమ్ముతున్నారు. ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మేలుకుని ధరలు తగ్గించేలా చర్యలు తీసుకోవాలని సామాన్యులు కోరుతున్నారు.

పెరుగుతున్న ధరలను అరికట్టాలి



రోజురోజుకూ పెరిగిపోతున్న నిత్యావసరాల ధరలు అరికట్టే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. కూరగాయల రైతుల పరిస్థితైతే అతి వృష్టి...లేకపోతే అనావృష్టి అన్న చందంగా ఉంది. సామాన్య ప్రజలు నిత్యావసరాలు కొనుగోలు చేయలేని పరిస్థితి ఏర్పడింది. ప్రజల కొనుగోలు శక్తిని పెంచే విధంగా నిత్యావసరాలు, కూరగాయలు సామాన్యులకు అందుబాటులో ఉండే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి.

– బండి వెంకటేశ్వరరావు, సీపీఐ నాయకుడు

కొనుగోలు శక్తి తగ్గింది



నిత్యావసరాలతో పాటుకూరగాయల ధరలు కూడా బాగా పెరిగిపోయాయి. దీంతో మా కొనుగోలు శక్తి తగ్గింది. గతంలో వారానికి రూ.100 నుంచి రూ.150తో కూరగాయాలుపై ఖర్చు అయ్యేది. తాజాగా ఆ బడ్జెట్ రెట్టింపు అవ్వడంతో కూరగాయలను తక్కువగా కొనుగోలు చేస్తూ కాలక్షేపం చేస్తున్నాం. రోజు వారి వినియోగించే మినపగుళ్ల సైతం కిలో రూ.160 నుంచి రూ.200 పలుకుతుంది. నిత్యం కూరల దగ్గర సర్దుకుపోవాల్సి వస్తుంది.

– వెంపా విజయలక్ష్మి, గృహిణి, పాలగూడెం

ఏం కొనలేకపోతున్నాం



ఎన్నడూ లేని విధంగా మార్కెట్‌లో అన్ని నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి పోయాయి. ఏమీ కొనలేని పరిస్థితి నెలకొంటుంది. ఇటు కూరగాయలు ధరలు మండి పోతున్నాయి. రోజురోజుకూ గ్యాస్ ధరలు పెరిగిపోతున్నాయి. అంగడిలో పప్పుదినుసుల పరిస్థితి ఇలానే ఉంది. చాలీచాలని ఆదాయంతో మార్కెట్‌లో ఏమీ కొనే పరిస్థితి కనిపించడం లేదు. ప్రజల కొనుగోలు శక్తి పెంచే విధంగా ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలి.

– సీహెచ్ నిర్మల, గృహిణి, ఏలూరు వన్ టౌన్

ధరల నియంత్రణకు పాలకులు చర్యలు చేపట్టాలి



ఇబ్బడి ముబ్బడిగా పెరిగిపోతున్న నిత్యావసరాలు, కూరగాయలు, పెట్రోలు, డీజిల్, గ్యాస్ ధరల నియంత్రణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలి. ప్రజల్లో కొనుగోలు శక్తి తగ్గిపోవడంతో తమ పిల్లలకు పూర్తి స్థాయిలో పౌష్టికాహారం అందించలేని పరిస్థితి ఏర్పడింది. ప్రజల ఆదాయం పెంచే విధంగా ప్రభుత్వాలు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

– పి.కిషోర్, ఏఐటీయూసీ నాయకుడు,ఏలూరు

నేటి నుంచి గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలు

దెందులూరు: ఏలూరు రూరల్ మండలం చాటపర్రు గ్రంథాలయంలో విద్యార్థులకు సోమవారం నుంచి వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ అధికారి కె.వాసుకి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. జూన్ 6 వరకు విద్యార్థులకు సమ్మర్ క్యాంపులో ప్రతిరోజూ ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

దెందులూరులో..

దెందులూరు: దెందులూరు, పోతునూరు గ్రంథాలయాల్లో సోమవారం నుంచి సమ్మర్ క్యాంపులు ప్రారంభమవుతాయని గ్రంథాలయ అధికారులు ఝాన్సీ, రాంబాబు తెలిపారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో ప్రతిరోజూ ఉదయం 11 గంటల వరకు ఈ క్యాంపులు జరుగుతాయన్నారు. వ్యాసరచన, క్విజ్, చదవడం, డ్రాయింగ్, పెయింటింగ్ విభాగాల్లో విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. పాఠశాలల విద్యార్థులు సమ్మర్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ అధికారులు కోరారు.

నేడు మహా కుంభాభిషేక మహోత్సవం

దెందులూరు: మండలంలోని సత్యనారాయణపురం గ్రామంలో ఉన్న శ్రీ సీతారామా చంద్ర స్వామి ఆలయంలో మహా కుంభాభిషేకం మహోత్సవం సోమవారం నుంచి ప్రారంభమవుతున్నట్లు భక్త సమాజ సభ్యులు తెలిపారు. మే 1వ తేదీ వరకు ఈ ఉత్సవాలు జరుగుతాయని, భక్తులు పాల్గొని స్వామివారిని ఆశీస్సులు పొందాలని కోరారు.

నేటినుంచి రక్షణ సువార్త సభలు

దెందులూరు: జోగన్నపాలెంలోని దెందులూరు జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం నివాసంలో సోమవారం నుంచి రక్షణ సువార్త సభలు జరుగుతాయని మండల వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ నేత నిట్టా గంగరాజు తెలిపారు. మూడు రోజులపాటు ప్రతిరోజు సాయంత్రం 6 గంటలకు సభలు ప్రారంభమవుతాయన్నారు. దెందులూరు సమీప మండలాల్లోని విశ్వాసులు రక్షణ సువార్త సభలకు హాజరై దేవుని దీవెనలు పొందాలని ఆయన కోరారు.

హైవేపై డివైడర్ ఏర్పాటు



హైవేపై ఏర్పాటు చేసిన డివైడర్

దెందులూరు: జాతీయ రహదారిపై దెందులూరు మండలం కొమిరేపల్లివద్ద డబుల్ రోడ్లలో డివైడర్ ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు డివైడర్ ఉన్నప్పటికీ దాన్ని తొలగించడంతో వాహనాలు రాంగ్ రూట్‌లో అటు నుంచి ఇటు, ఇటు నుంచి అటు రావడంతో అనేక ప్రమాదాలు జగుతున్నాయి. దీనిపై స్పందించిన పోలీస్ శాఖ, నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులు ప్రమాదాల నివారణలో భాగంగా హైవే రోడ్‌లో డివైడర్ ఏర్పాటు చేశారు.

సైబర్ నేరాలపై అవగాహనతో ఉండాలి



సైబర్ నేరాల అవగాహన ర్యాలీలో పాల్గొన్న అడిషనల్ ఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు

ఏలూరు (టూటౌన్): సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని అడిషనల్ ఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు అన్నారు. స్థానిక డీపాల్ కాలేజీలో 19 ఆంధ్రా బెటాలియన్ ఎన్‌సీసీ కమాండెంట్ అమిత్ పాండే నేతృత్వంలో నిర్వహిస్తున్న వార్షిక ట్రైనింగ్ క్యాంప్‌లో భాగంగా ఆదివారం నార్కోటిక్స్ అండ్ డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అడిషనల్ ఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు 610 ఎన్‌సీసీ క్యాడెట్స్‌కు నార్కోటిక్స్, డ్రగ్స్, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీసీఆర్‌బీ సీఐ హబీబ్ బాషా, మూడో పట్టణ సీఐ కోటేశ్వరరావు, ఆర్ఎస్ఐ ఈగల్ డిపార్టుమెంట్ బి.ఉదయ్ భాస్కర్, ఏలూరు సైబర్ క్రైమ్ సెల్ ఎస్సై వెంకట్ మధురాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రదాడిని నిరసిస్తూ కొవ్వొత్తుల ర్యాలీ



కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న అమ్మానాన్న చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు

ఏలూరు (టూటౌన్): పహల్గామ్‌లో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని అమ్మానాన్న చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మారం హనుమంతరావు అన్నారు. ఉగ్రవాదుల దాడిలో 26 మంది పర్యాటకలు మరణించడం పట్ల తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేస్తూ ఆదివారం రాత్రి ఏలూరులో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. బిర్లా భవన్ సెంటర్ నుంచి వైఎంహెచ్ఏ హాల్ వరకు ర్యాలీ చేశారు. అనంతరం హనుమంతరావు మాట్లాడుతూ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఉగ్రవాదులను పట్టుకుని కఠినంగా శిక్షించాలని అన్నారు. సురేష్, గెల్ల శ్రీను, బండి వాసు, గంగాధరరావు, కరీముల్లా, జి.నాగేశ్వరరావు, జానా వాసు, విజయవర్మ పాల్గొన్నారు.

వ్యాపారులు ఐక్యతతో ముందుకు సాగాలి



సమావేశంలో మాట్లాడుతున్న లింగమల్లు శ్రీనివాసరావు

ఏలూరు (టూటౌన్): నగరంలోని ఎలక్ట్రికల్, ప్లంబింగ్, శానిటరీ వ్యాపారులు ఐకమత్యంతో ముందుకు సాగుతూ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. సీమ ఎలక్ట్రికల్ అండ్ శానిటరీ ప్లంబింగ్ అసోసియేషన్ సమావేశం స్థానిక సూర్య రెసిడెన్సీలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు మాట్లాడుతూ అసోసియేషన్ బలంగా ఉంటేనే ఏ షాపు వారికైనా ఇబ్బంది కలిగితే సహాయ సహకారాలు అందించడానికి వీలుంటుందనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సంఘ అభివృద్ధికోసం రూ.25వేలు విరాళాన్ని అందజేశారు.సమావేశంలో భాగంగా అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడిగా ముద్దుల శ్రీనివాసరావు, అధ్యక్షుడిగా కొల్లారి మణికంఠ, కార్యదర్శిగా కొల్లా సుధీర్, కోశాధికారిగా మాలి భగవాన్,ఉపాధ్యక్షులుగా మానేపల్లి సత్యనారాయణ, వందనపు నాగేశ్వరరావు తదితరులను ఎన్నుకున్నారు.

ముగిసిన చెస్ పోటీలు



చెస్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

ఏలూరు (టూటౌన్): దేశంలో సోషలిస్టు రాజ్యమే లక్ష్యంగా భారత కమ్యూనిస్టు పార్టీ పనిచేస్తుందని సీపీఐ, ఏఐటీయూసి నాయకులు ఆర్.శ్రీనివాస్ డాంగే, పి.కిషోర్ అన్నారు. ఆదివారం సీపీఐ జిల్లా కార్యాలయం స్ఫూర్తి భవన్‌లో మేడే సందర్భంగా నిర్వహించిన జిల్లా ఓపెన్ చెస్ టోర్నమెంట్ రెండో రోజు గెలుపొందిన విజేతలకు బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ ఏలూరు ఏరియా కార్యదర్శి అప్పలరాజు, నాయకులు జగన్నాథరావు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకుడు భజంత్రీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

టోర్నమెంట్లో విజేతలు వీరే

జిల్లా ఓపెన్ చెస్ టోర్నమెంట్లో ఛాంపియన్‌గా కేఎస్ఎస్ కార్తీక నిలిచారు. తర్వాత టాప్-5లో కె.ఓంకార్, ఎం.నాగరాజు, జి.అఖిల సాయి పుండరీనాథ్, ఎం.కుశాంక్, శ్రీ విశ్వ తదితరులు విజేతలుగా నిలిచారు. వివిధ ఏజ్ గ్రూపుల్లో మరో 20 మంది గెలుపొందగా 5 గురికి ప్రత్యేక కన్సోలేషన్ బహుమతులు అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	18	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	24	చిక్కుడు కాయలు	76
వంకాయలు (కాంతులు)	34	బీన్స చిక్కుడు	84
వంకాయలు (తెలుపు)	26-34	చామదుంపలు	54
బెండకాయలు	26	ములక్కాడలు	08, 10
పచ్చిమిర్చి	36	కంద	--
కాకర కాయలు	32	బీట్‌రూట్	28
బీరకాయలు	30-40	కీరా దోస	36
బీరకాయలు (పందిరి)	--	ఫ్రెంచ్‌బీన్స్	70
క్యాబేజీ	20	అల్లం	60
క్యారెట్	34	కొత్తిమీర (కట్ట)	25
దొండకాయలు	20	పాలకూర	12
బంగాళదుంపలు	32	తోటకూర	10
ఉల్లిపాయలు	24	చుక్కకూర	12
గోరుచిక్కుడు	36	గోంగూర	07-10
దోసకాయలు	20	పుదీనా	05
ఆనబకాయ (1)	20	క్యాప్సికమ్	60
పొట్లకాయ(1)	20-25	చిలకడదుంప	40

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	09
ఏలూరు - జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	30
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	25
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	25
ఏలూరు - తిరుపతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	15
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.15	4822	18
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	18
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	07
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	17
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	16
ఏలూరు - తిరుపతి	16.00	4830	33

200 మందికి కంటి వైద్యసేవలు



గణపవరంలో లయన్స్ నేత్ర వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

గణపవరం: లయన్స్ క్లబ్ సేవలు మారుమూల గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేదలకు అందేలా కార్యక్రమం రూపొందించినట్లు లయన్స్ జిల్లా మాజీ గవర్నర్ ఈపూరి సత్యనారాయణ తెలిపారు. ఆదివారం గణపవరం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో వర్తక సంఘ భవనంలో ఉచిత కంటివైద్యశిబిరం నిర్వహించారు. శిబిరాన్ని సీనియర్ లయన్ సభ్యుడు క్రొవ్విడి నాగేంద్రప్రసాద్ ప్రారంభించారు. 200 మందికి కంటి పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. అవసరమైన వారికి ఉచితంగా శస్త్రచికిత్సలు చేయించనున్నట్లు క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పచ్చిపులుసు నాగేశ్వరరావు, కల్లిగొట్ల విశారద తెలిపారు. లయన్స్ జోన్ చైర్మన్‌లు వెల్లంకి నరేష్, కె.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మానవత చేయూత

ఉంగుటూరు : కైకరం గ్రామానికి చెందిన చల్లా కృపా ఏంజెల్ అనే చార్టర్డ్ అకౌంటెన్సీ విద్యార్థినికి మానవత సంస్థ ప్రతినిధులు ఆదివారం రూ.10 వేల సాయం అందజేశారు. నారాయణపురంలో నిర్వహించిన మండల ప్రతినిధుల సమావేశంలో ఈ సొమ్ము అందించారు. సంస్థ మండల అధ్యక్షుడు వి.రంగరాజు తదితరులు పాల్గొన్నారు.

యమ డేంజర్

- మలుపులు.. ఆదమరిస్తే అంతే సంగతులు
- ప్రమాదకర మలుపుల్లో హెచ్చరిక బోర్డులు కానరాని వైనం



సరిపల్లెలోని ప్రమాదకర మలుపు



రాచూరు రెండు గుళ్లవద్ద పరిస్థితి ఇది



గణపవరం బండిరేవు వద్ద మలుపు ఇలా..

గణపవరం: గణపవరం ఆర్‌అండ్‌బీ సెక్షన్ పరిధిలోని పలుచోట్ల ఆర్‌అండ్‌బీ రహదారులపై ఉన్న మలుపులు ప్రమాదాలకు నిలయాలుగా మారాయి. అలాగే ముఖ్యమైన మూడు రోడ్ల కూడళ్లు సైతం వాహనదారుల పాలిట యమగండాలుగా తయారయ్యాయి. గణపవరం నుంచి తాడేపల్లిగూడెం, భీమవరం, ఏలూరు వైపు వెళ్లే ప్రధాన రహదారులపై కొన్నిచోట్ల ఎల్ ఆకారంలోను, కొన్నిచోట్ల జెడ్ ఆకారంలో, మరికొన్ని చోట్ల ఎస్ ఆకారంలో అనేక మలుపులు ఉన్నాయి. మరికొన్ని చోట్ల మూడు రోడ్లు కలిసే కూడళ్లు ఉన్నాయి. నిత్యం వందలాది వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే ఈ రహదారులపై ఉన్న మలుపుల వద్ద వాహనాలు వెంట్రుకవాసిలో ప్రమాదాల బారినుంచి బయట పడిన సందర్భాలనేకం ఉన్నాయి. ఇలాంటి ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు, వేగనియంత్రణలు, మార్గసూచికలు లేకపోవడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.

- గణపవరం-తాడేపల్లిగూడెం రహదారిలో గణపవరం సెంటర్‌కు అతి సమీపంలో బండిరేవు వద్ద ఎల్ ఆకారంలో ఉన్న మలుపులో ఎదురుగా వచ్చే వాహనాలు సమీపంలోకి వస్తే తప్ప కనిపించవు. ఇక్కడ వాహనదారులు బిక్కుబిక్కుమంటూ వాహనాలను నడుపుతుంటారు.
- ఇక బొబ్బిలి వంతెన దిగువన ఉన్న మూడురోడ్ల కూడలిలో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలుగుతుంది. ఏలూరువైపు, గణపవరం వైపు వెళ్లే వాహనాలు, ఆకివీడువైపు నుంచి వచ్చే వాహనాలు ఒకేసారి మలుపువద్ద ఎదురెదురుగా వచ్చినప్పుడు తప్పకోవడం గగనంగా ఉంటుంది.
- భీమవరం వైపు వెళ్లే రహదారిలో సరిపల్లె వెలంపేటవద్ద, బీసీ కాలనీల వద్ద ఉన్న ఎల్ ఆకారపు మలుపుల్లో ఎదురుగా వచ్చే వాహనాలు సమీపంలోకి వస్తే తప్ప కనిపించవు.
- బాలయ్య చెర్వువద్ద ఉన్న మలుపు మార్జిన్‌లో వాహనాలు నిలుపుదల చేసి ఉండటం వల్ల ఎదురెదురుగా వాహనాలు వస్తే ఇక అంతే సంగతులు.
- మందలపర్రు వంతెన వద్ద, నాగనమిల్లి పుంతముసలమ్మ గుడివద్ద, నిడమర్రు హైస్కూలు వద్ద ఉన్న మలుపులు ప్రమాదభరితంగా ఉన్నాయి. నాగనమిల్లి ఎస్ టర్నింగ్‌లో ఇప్పటికే అనేక ప్రమాదాలు జరిగాయి.
- ఇక అత్యంత ప్రమాదకరమైన మలుపు రాచూరు వద్ద ఉంది, ఎల్ ఆకారంలో ఉండే మలుపులో రోడ్డు ఇరుకుగా ఉండటం వల్ల ఎదురుగా వచ్చే వాహనాలు ఐదారు అడుగుల సమీపంలోకి వస్తే తప్ప కనిపించవు.

కూడళ్లు.. ఇక్కట్లు

పిప్పర సెంటర్‌లో తాడేపల్లిగూడెం, భీమవరం, అత్తిలి వైపు వెళ్లే మూడు రోడ్లు కలిసే కూడలి ఎప్పుడూ రద్దీగా ఉంటూ, మూడువైపుల నుంచి వచ్చే వాహనాలు ఒకే సమయంలో కూడలిలోకి వచ్చి ట్రాఫిక్ నిలిచిపోతుంది. పిప్పర శివారు కనకదుర్గ గుడివద్ద మూడు రోడ్ల కూడలి ప్రమాదాలకు నిలయంగా ఉంటుంది. బువ్వనపల్లి సెంటర్‌లో మూడు రోడ్ల కూడలిలో కూడా నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. నిడమర్రు సెంటర్‌లో మూడు రోడ్ల కూడలి కూడా ప్రమాదకరంగా ఉంటుంది.